క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సై



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై షణ్ముఖరావు

జియ్యమ్మవలస: కురుపాం పోలీస్ స్టేషన్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన షణ్ముఖరావు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. ఈ నెల 21 చినమేరంగిలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి హోం శాఖామంత్రి తానేటి వనిత రానున్న దృష్ట్యా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

'ఆడుదాం ఆంధ్రా' కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్ కిట్లను ఎంపీపీ బి.ఆదినారాయణ సోమవారం గ్రామ సచివాలయ సిబ్బందికి అందజేశారు. క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ గోపాలకృష్ణ, ఎంపీడీఓ గీతాంజలి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వనభోజనాలు



వనభోజనాలు చేస్తున్న గ్రామస్తులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామం సమీపంలోని తోటలో సోమవారం కార్తీక వన భోజనాల సందడి నెలకొంది. కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా గ్రామస్తులంతా శివాలయంలో పూజలు చేశారు. అనంతరం సమీపంలోని తోటలో సామూహికంగా వనభోజనాలు చేశారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు, ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

క్రికెట్ టోర్నీ విజేత రాయిల్ స్ట్రైకర్స్



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బంది మధ్య నిర్వహించిన క్రికెట్ టోర్నీలో రాయిల్ స్ట్రైకర్స్ జట్టు విజేతగా నిలిచింది. మండలంలోని మంగళాపురంలో సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో ముందుగా బ్యాటింగ్ చేసిన రాయిల్ స్ట్రైకర్స్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 125 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బ్లాక్ పాంథర్స్ జట్టు 115 పరుగులకే ఆల్ ఔట్ అయ్యింది. విజేతలకు రూ.18వేలు, రన్నర్స్‌కు రూ.12 వేలు నగదు, ట్రోఫీలను ఎంపీడీఓ డొంక త్రినాథులు, పీఆర్ డీఈఈ లోకనాథం, పాలకొండ, సీతంపేట ఈఓపీఆర్డీలు సూర్యనారాయణ, సత్యం అందజేశారు.

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

కొమరాడ: అంతర పంటలు, పెరటి తోటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని వన్నాం పంచాయతీ చెక్కవలస గ్రామంలో ఎం.ప్రభాకర్ అనే రైతుకు చెందిన పత్తి పంటలో సాగు చేస్తున్న అంతర పంటలను సోమవారం పరిశీలించారు. రైతులు పెరటి తోటలు సాగు చేయడం ద్వారా కుటుంబానికి కావాల్సిన ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటల్లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ జిల్లాల్లో 15 మండలాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేస్తున్నారని అన్నారు. ప్రధాన పంటలో తీగ, దుంప జాతి పంటలు, ఆకుకూరలు, కాయగూర పంటలను అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు.

పురోహితులకు సత్కారం

భామిని: ఘనసర శ్రీమధన కామేశ్వరుని సన్నిధిలో సుబ్రహ్మణ్య స్వామి యాగం నిర్వహించిన పురోహితులు గుడిమెట్ల శ్రీనివాస శర్మ, రంపా లలితప్రసాద్ శర్మలను సోమవారం గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొవ్వాడ చిరంజీవులు, మండల కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు, ఆలయ కమిటీ కన్వీనర్ ఎరుకుమజ్జి అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్‌ప్రసాద్ పాత్రో, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం-1 వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దీనమయ్య, పార్టీ శ్రేణులు



జియ్యమ్మవలస: బిత్రపాడులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, పార్టీ శ్రేణులు



కొమరాడ: మాదలింగిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ శెట్టి శ్యామల, తదితరులు

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ లబ్ధిని తెలియజేసే డాష్‌బోర్డులను గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా జగనన్నకు మద్దతివ్వాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: పనుకువలసలో ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాన్ని వివరిస్తున్న ప్రజాప్రతినిధులు



గరుగుబిల్లి: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో లక్షదీపారాధన



కొమరాడ: గుంపస్వామీశ్వరడి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మార్మోగిన శివ నామస్మరణ

కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువ జామునుంచే ఆలయాల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గరుగుబిల్లి మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయం ప్రాంగణంలో లక్షదీపారాధన, సీతంపేటలోని లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపారదన కార్యక్రమం చేపట్టారు. పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. కురుపాం మండలం మెండెంఖల్ గ్రామంలోని శివాలయాన్ని, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



భామిని: నేరడి శివాలయంలో బారులుతీరిన భక్తులు



కురుపాం: మొండెంఖల్‌లో మరకత శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పాలకొండ రూరల్: నక్కలపేట షిర్డీసాయి మందిరంలో మరకత శివలింగానికి అర్చన చేస్తున్న భక్తులు



సీతంపేట: లక్ష్మీగణపతి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పరిపాలన అంశాలపై దృష్టిసారించాలి

గుమ్మలక్ష్మీపురం: గ్రామ సచివాలయ ఉద్యోగులు పరిపాలన అంశాలపై దృష్టిసారించాలని ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం, వైకేపీ, వైటీసీ కార్యాలయంలో 12 గ్రామ సచివాలయాల సిబ్బందికి పాలన అంశాలకు సంబంధించి సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ. గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న సిబ్బంది స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషిచేయాలన్నారు. ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.



ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ప్రకృతి పంటలతో ఆరోగ్యం

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ పంటలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం రైతు సాధికార సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం (స్టాల్)ను ఏర్పాటు చేశారు. వాటిలో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులను కూడా విక్రయానికి ఉంచారు. ఈ స్టాల్‌ను ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంటలను ప్రజలకు చేరువచేసేందుకు ఈ స్టాల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పెరటితోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీం లీడర్ వై.గణేష్ శరత్‌చంద్ర, ఎంటీలు స్వామినాయుడు, జి.నిర్మల దేవి, కోఆర్డినేటర్లు కె.భూషణరావు, కె.మిన్నారావు తదితరులున్నారు.

ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించాలి

• ఏపీఎస్ఐఆర్డీ పీఆర్ జె.మురళి

కొమరాడ, పాలకొండ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే గ్రామ సచివాలయ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమని ఏపీఎస్ఐఆర్‌డీ పీఆర్ జె.మురళి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగ్గా ప్రభుత్వ సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్డీ పీఆర్ మురళి

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

గరుగుబిల్లి: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో ఉన్నతి మహిళా శక్తి పథకం కింద మహిళలకు మంజూరైన ఆటోలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న ఉన్నతమైన ఆశయంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆటో నడుపుకొని వచ్చిన ఆదాయంతో జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. స్వయం శక్తి సంఘాల్లోని అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీలకు చెందిన మహిళలకు ఉన్నతి పథకం ద్వారా వడ్డీలేని రుణాలతో ఆటోలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.ఇందుమతి, ఎంపీడీఓ జి.పైడితల్లి, ఏపీఎం పి.అప్పలనాయుడు తదితరులున్నారు.



ఉన్నతి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రామారావు

పోలిపాడ్యమి ఏర్పాట్లు పూర్తి

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పోలిపాడ్యమి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సూర్యనారాయణ సోమవారం తెలిపారు. కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని నాగావళి నదీకి పుణ్యహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం విశ్వశాంతి కోసం హోమం చేయనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పోలిపాడ్యమి ఏర్పాట్లను ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, పాలకొండ ట్రైనీ డీఎస్పీ అజీజ్‌లు పరిశీలించారు.



నాగావళి తీరంలో పోలిపాడ్యమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ అజీజ్, తదితరులు

గిరిజన స్పందనకు 26 వినతులు

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 26 వినతులు వచ్చాయి. వాటర్‌ట్యాంక్ మంజూరు చేయాలని సవరలింగుపురానికి చెందిన రవి, నాటుకోళ్ల వ్యాపారం కోసం రుణం ఇప్పించాలని ఎగువగూడకు చెందిన కాంతమ్మ అధికారులను కోరారు. పంటనష్ట పరిహారం ఇప్పించాలని కాశిమానుగూడకు చెందిన బుడ్డయ్య, కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని జామిగూడ గ్రామస్తుడు అరిక ఆఫీసు వినుతులు అందజేశారు. ఆటో కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని జనగలపాడు చుక్కయ్య, మినీఅంగన్‌వాడీ పోస్టులో నియమించాలని ఎర్రమానుగూడకు చెందిన ప్రమీల దరఖాస్తు చేసుకున్నారు. ఆయా వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

చిన్నారుల ఆరోగ్య రక్షణకు 'మిషన్ ఇంద్రధనస్సు'



వీరఘట్టం: వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు



గరుగుబిల్లి: తోటపల్లిలో సిబ్బంది సూచనలు చేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

• జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జగన్నాథరావు

వీరఘట్టం: ప్రమాదకర వ్యాధుల నుంచి పిల్లలను రక్షించేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని, ఇందుకోసం ప్రభుత్వం 'మిషన్ ఇంద్ర ధనస్సు' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు అన్నారు. జిల్లాలో మూడో విడత 'మిషన్ ఇంద్ర ధనస్సు' కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమైనట్లు చెప్పారు. వీరఘట్టం-2 సచివాలయంలో నిర్వహించిన టీకా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిల్లల వివరాలు, వయస్సు, వారికి వేసిన టీకా వివరాలను కచ్చితంగా రికార్డులో, యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం అర్హులైన పిల్లలు, గర్భిణులతో పాటు వివిధ కారణాలతో గతంలో టీకాలు వేయించుకోని పిల్లలను గుర్తించి వారికి టీకాలు వేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏడాది లోపు వయసు పిల్లలు 849 మంది, 1–5 ఏళ్లలోపు పిల్లలు 423 మంది, గర్భిణులు 282 మంది ఉన్నట్లు గుర్తించామని, వారందరికీ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 16 వరకు వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వరి, యోగీశ్వర రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలి

గరుగుబిల్లి: చిన్నారులకు సకాలంలో టీకాలను వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని తోటపల్లి, సంతోషపురం, నాగూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న 'మిషన్ ఇంద్రధనస్సు' కార్యక్రమాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. టీకా కేంద్రంలో వ్యాక్సిన్‌లు, అత్యవసర మందులు, కిట్లు, హబ్‌కట్టర్ పనితీరు, అర్హుల జాబితా తదితర వాటిని పరిశీలించారు. అలాగే యూవిన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ వివరాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించే మిషన్ ఇంద్రధనస్సు మూడో విడత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గతంలో ఏవైనా కారణాలతో టీకాలు వేసుకోని పిల్లలకు ఈ విడతలో టీకాలు వేయాలని సూచించారు. వ్యాక్సినేషన్‌పై ముందురోజే అక్కడ ప్రజలకు తెలియజేయాలన్నారు. మాతా,శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ సన్యాసమ్మ, జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలున్నారు.

పంట నష్టాలపై సమగ్ర పరిశీలన

పాలకొండ: తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టాలను అంచనా వేస్తున్నామని వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి అ న్నారు. పాలకొండ డివిజన్‌లోని అన్ని గ్రామా ల్లో వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంటనష్టాలను పరిశీలించడం జరిగిందన్నారు. మండలంపై తుపాను ప్రభావం పెద్దగా లేదని, కొన్నిచోట్ల కోత కోసిన వరిపంట తడిచిపోయిందని, తడిచిన పంటను త్వరగా నూర్పిడి చేసి ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు.

పాస్‌పుస్తకాల్లో తప్పులు సరిచేయండి

వీరఘట్టం: పట్టాదారు పాస్ పుస్తకాల్లో పేర్లు, భూముల వివరాలు తప్పుగా నమోదయ్యాయని, వాటిని సరిచేయాలని బొడ్లపాడు గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు స్పందనలో తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత వీఆర్వో, మండల సర్వేయర్లను పిలిపించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తప్పులు ఉన్న పాస్ పుస్తకాలను పరిశీలించి, అవసరమైతే మరోసారి సర్వే చేసి కొత్త పాస్ పుస్తకాలు అందజేస్తామన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పాలకొండ రూరల్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రయాణికుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవడంతో పాటు వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు 9959225057 నంబర్‌కు ఫోన్‌చేయాలని కోరారు.

విస్తృతంగా 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'

కొమరాడ: మండలంలోని గంగారేగువలస, కొమరాడ, కోటిపాం తదితర గ్రామల్లో సోమవారం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి మాట్లాడుతూ.. మహిళా సాధికారిత కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని, మహిళలంతా వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

గరుగుబిల్లి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బాల్యవివాహాలపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టప్రకారం నేరమన్నారు. బాల్యవివాహాల నిర్మూలన చట్టం–2006ను ఎవరైనా ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బడి ఈడు పిల్లలను బడికి పంపించాలన్నారు. బాల్యవివాహాలపై అంగన్‌వాడీలకు, వైద్య సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. గ్రామైఖ్య సంఘ సభ్యులు, వెలుగు సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి

కురుపాం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రమేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని, కొంత మందికి అర్హత ఉన్నా అవగాహన లేక సంక్షేమ పథకాల అందని పరిస్థితి నెలకొందన్నారు. అటువంటి వారిని సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు.